**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

మహిళలంత గూడ మహిమతో భువనాన
అన్నిరంగములన యద్భుతముగ
రాణివలెను నేడు రాణించుచుండిరి
వందనములుమీకు వనితలార

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 206 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 7-11 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## తెలంగాణ నేటి కేబినేట్ భేటీ వాయిదా

- తిరిగి 12న జరపాలని నిర్ణయం

**హైదరాబాద్, నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నేడు జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. హైకోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన స్థానిక ఎన్నికలపై చివరిసారిగా జరిగిన కేబినెట్‌లోనూ క్లారిటీ రాలేదు. నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీకి

-మిగతా 2 లో

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

**ఈ మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి**

- చిన్న ఏమరుపాటు కూడా పనికి రాదు
- ప్రతి ఓటరును కలిసి మన వాయిస్ వినిపించాలి
- బీఆర్ఎస్ దుష్ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి
- మంత్రులు, పార్టీ నేతలకు సీఎం దిశానిర్దేశం






**హైదరాబాద్,-నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఇక్కడ ఖచ్చితంగా గెలవబోతున్నామని, అందువల్ల మెర్జీ కోసం కృషి చేయాలన్నారు. అలాగే ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ బూత్‌కు వచ్చి ఓటేసేలా చూసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

-మిగతా 2 లో

## గతంలో వచ్చిన 25వేల ఓట్లు తెచ్చుకోగలరా

- మీకు పదివేల లోపే ఓట్లు రాలుతాయి
- కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం సవాల్



**హైదరాబాద్, నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి సవాల్ విసిరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థికి 25 వేల ఓట్లు వచ్చాయని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో 25 వేలకు ఒక్క ఓటు తగ్గకుండా తీసుకువస్తే.. మీరేం చెబితే అందుకు తాను సిద్ధం అని చెప్పారు. 25 వేల ఓట్లు బీజేపీ అభ్యర్థికి రాకపోతే.. తాను చెప్పింది చేయడానికి కిషన్ రెడ్డి సిద్ధమా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పదివేల లోపే బీజేపీకి ఓట్లు వస్తాయని పొన్నం ప్రభాకర్

-మిగతా 2 లో




## వందేమాతరానికి 150 ఏళ్లు

- ఏడాదిపాటు దేశ వ్యాప్తంగా ఉత్సవాలు
- నేడు ఢిల్లీలో వేడుకలను ప్రారంభించనున్న ప్రధాని

**న్యూఢిల్లీ,**
జాతీయ గీతం 'వందేమాతరానికి' 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనుంది. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలు నవంబర్ 7 నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7 వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరగనున్నాయి. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు జరగనున్నాయి. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన జాతీయ గేయం 'వందేమాతరం' 2025 నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. 1875 నవంబర్ 7వ తేదీన అక్షయ నవమి పర్వదినం సందర్భంగా దీనిని రచించినట్లు చెబుతారు. ఆయన నవల 'ఆనందమఠ్'లో మొదటగా ఈ గేయం వెలుగు చూసింది. ఈ నవల అప్పట్లో 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ధారావాహికగా వెలువడింది. ఆ తర్వాత 1882లో ఒక ప్రత్యేక పుస్తకంగా

-మిగతా 2 లో

## మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు ఈడీ షాక్..

- బెట్టింగ్ యాప్ కేసులో ఆస్తులు అటాచ్..!



2లో

## బీహార్ తొలివిడతలో 60.13శాతం పోలింగ్

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- డిప్యూటి సీఎం సిన్హా కారుపై దాడి



**పాట్నా,**
దేశమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన బీహార్ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ పూర్తయింది. సాయంత్రం 5 గంటల సమయం వరకు 60.13 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గానూ ఈ రోజు తొలిదశ పోలింగ్‌లో భాగంగా 121 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మిగిలిన అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. నవంబర్ 14వ తేదీన కౌంటింగ్ ఉంటుంది. మొత్తం 121 నియోజకవర్గాల్లో పోలింగ్ దాదాపు ప్రశాంతంగానే జరిగింది. లఖిసరాయ్ నియోజకవర్గంలో మాత్రం కాస్త ఆందోళన నెలకొంది. బీహార్ డిప్యూటీ సీఎం, లఖిసరాయ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విజయ్ కుమార్ సిన్హా కారుపై దాడి జరిగింది. లఖిసరాయ్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను విజయ్ కుమార్ సందర్శిస్తున్న సమయంలో ఆయన కారును కొందరు వ్యక్తులు అడ్డుకునే యత్నం చేశారు . విజయ్ కుమార్ వాహనంపై చెప్పులు, పేడ విసరడంతో పాటు, ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. విజయ్ కుమార్ సిన్హా వాహనం

-మిగతా 2 లో

## జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

**ఇందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్రా ఉంది**

- ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే
- ముస్లింలు కాంగ్రెస్‌కు ఇజ్జత్ అయితే..మరి హిందువులో
- మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి



**హైదరాబాద్ - నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చిందన్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో 6

-మిగతా 2 లో

## చర్చలు ఫలించకపోతే యుద్ధమే..

- అఫ్గానిస్థాన్‌కు పాకిస్థాన్ వార్నింగ్



**న్యూఢిల్లీ, -**
ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు గురువారం పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ దేశాల మధ్య కీలకమైన శాంతి చర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో చర్చల ప్రారంభానికి ముందే పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి చర్చలు ఫలించకపోతే తాలిబన్ల తో యుద్ధానికి వెళ్లాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. శాంతిచర్చలు విఫలమైతే ఇరుదేశాల మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతాయన్నారు. 'మా వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయి. శత్రువులు మమ్మల్ని ఎలా టార్గెట్ చేస్తారన్న దాన్ని బట్టి మా ప్రతిస్పందన కూడా తీవ్రస్థాయిలో ఉంటుంది. చర్చలు ఫలించకపోతే యుద్ధం జరిగి తీరుతుంది' అని ఖవాజా వ్యాఖ్యానించారు.

-మిగతా 2 లో




## జూబ్లీహిల్స్‌లో ఎవరి ధీమా వారిది

- గెలిచి చేసేదేమీ లేదన్నది ప్రజలకు తెలుసు
- గెలవడం కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకే అవసరం
- ఓడినా గెలిచినా బిజెపికి వచ్చే నష్టం లేదు

**హైదరాబాద్ - నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం హోరాహోరీ పోరు సాగుతోంది. అతిరథ మహారథులంతా ప్రచారంలో దిగారు. కాంగ్రెస్ తరఫున సిఎం రేవంత్, మంత్రులు గల్లీగల్లీ ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌ల్తో సవాళ్లు విసురుతున్నారు. బిఆర్ఎస్ తరఫున కెటిఆర్ ముందు వరసలో ఉన్నారు. అనేకమంది బిఆర్ఎస్ నేతలు ఉన్నా ఆయనే ముందుండి నడుపుతున్నారు. ఇక బిజెపి నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎవరికి వారు విమర్శలు,

-మిగతా 2 లో

## 7 కాదు 8 జెట్లు కూలాయి..

- భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని ఆపింది నేనే :
- మరోసారి ట్రంప్ పాత పాటే



**న్యూఢిల్లీ, - నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారత్-పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పాత పాటే పాడారు. ఇరుదేశాల మధ్య శాంతికి తాను మధ్యవర్తిత్వం వహించినట్లు చెప్పుకొచ్చారు. వాణిజ్య సుంకాలతో ఈ వార్‌కు బ్రేకులు వేసినట్లు మరోసారి ట్రంప్ చెప్పారు.అయితే ఈ యుద్ధంలో కూలిన ఫైటర్ జెట్ల సంఖ్యను ట్రంప్ మరింత పెంచారు. ఇప్పటి వరకూ ఏడు జెట్లు కూలిపోయాయని

-మిగతా 2 లో

## ఏపీలో మెడికల్ విద్య ప్రైవేటీకరణ

- 12న పెద్ద ఎత్తున ఆందోళనలు,ర్యాలీలు చేపడతాం
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగన్



**అమరావతి,**
ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ విద్యారంగంపై సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం దరిద్రపు పని అని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ మాట్లాడుతూ.. మూడేళ్లలో మేము 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించాం. ప్రతి జిల్లాలో గవర్నమెంట్ కాలేజీలు ఏర్పరిచాం. కానీ చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేదు. ఇప్పుడు వాటిని ప్రైవేట్ వారికి అప్పగించాలనే ప్రయత్నం చేస్తున్నారు. సంవత్సరానికి వెయ్యి కోట్లు ఖర్చు చేసి అయినా ప్రజల ఆరోగ్య భవిష్యత్తును కాపాడాలని అన్నారు. చంద్రబాబు మంచి చేయకపోగా, చెడు చేస్తున్నారని విమర్శించిన ఆయన, విద్యార్థులు దీనిపై ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న ర్యాలీలు నిర్వహిస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై డిసెంబర్‌లో ఆందోళనలు చేపడతాం. అంతవరకు చంద్రబాబుకు సమయం ఇస్తున్నామని జగన్ చెప్పారు. అంతేకాకుండా.. 'మా వైసీపీ ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసింది. విద్యా దీవెన కింద రూ.12,609 కోట్లు ఇచ్చాం. వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి

-మిగతా 2 లో

## తెలంగాణ నేటి కేబినేట్ భేటీ వాయిదా

(మొదటి తరువాయి)

ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తున్నట్టు గత కేబినెట్ సమావేశం సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 21(3)ని తొలగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

## వందేమాతరానికి 150 ఏళ్లు

(మొదటి తరువాయి)

వచ్చింది. భారత్ భారీ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మార్పులకు లోనవుతున్న కాలమది. జాతీయ గుర్తింపు భావన, వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం.. మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా మార్చింది. జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. తర్వాత కొద్ది కాలంలో ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారింది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్.. వందేమాతరం స్వాతంత్య్ర పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని ప్రకటిస్తూ, జాతీయ గీతం జనగణమనతో సమానంగా వందేమాతరానికి గౌరవం ఇచ్చారు.

## గతంలో వచ్చిన 25వేల ఓట్లు తెచ్చుకోగలరా

(మొదటి తరువాయి)

జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్ గూడలో ప్రచారంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'మా అభ్యర్థి యువకుడు, స్థానికుడు, ఉత్సాహవంతుడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. గతంలో అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు మావైపు ఉన్నారు. మేము అధికారంలోకి వచ్చి అందించిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరఫున సానుకూలంగా ఉన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని అభివృద్ధి చేయించు కుంటున్నారో.. ఇక్కడి ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించి అభివృద్ధి చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ పెన్షన్లు ఇచ్చిన నిధులను కూడా లెక్క చెబితే.. అది అభివృద్ధి అవుతుందా?. అభివృద్ధి చేయడం అంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా డెవలప్ చేయడం. ఈ రెండు నెలల్లోనే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా 2500 కోట్ల అభివృద్ధి పనులను చేశామని అన్నారు. 'దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. ఇక మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇక్కడ సమస్యలను రిప్రెంటేషన్ చేయడంలో విఫలమయ్యాడు. భవిష్యత్తులో జూబ్లీహిల్స్ సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కిషన్ రెడ్డికి సహకరించింది. అందుకే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గురుదక్షిణగా బీజేపీ అభ్యర్థిని బీఆర్ఎస్కు తాకట్టు పెట్టాడు. మీ ప్రచారం సరళి చూసిన ప్రజలు మీ సొంత ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్ఎస్ పార్టీకి లొంగిపోయారని అంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీలో మీ ఓటు ఎటు వేసిన సరే అనే ప్రవర్తన కనిపిస్తుందని ప్రజలే అంటున్నారు.

## బీహార్ తొలివిడతలో 60.13శాతం పోలింగ్

(మొదటి తరువాయి)

ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ హింసాత్మకంగా మారింది. గురువారం ఉదయం 7 గంటలకు తొలి దశ పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ సమయంలో బీహార్ డిప్యూటీ సీఎం, లఖిసరాయ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విజయ్ కుమార్ సిన్హా కారుపై దాడి జరిగింది. లఖిసరాయ్ నియోజకవర్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తన కాన్వాయ్‌పై ఆర్జేడీ కార్యకర్తలు దాడి చేశారని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మళ్లీ ఆటవిక పాలన తప్పదని విజయ్ కుమార్ సిన్హా హెచ్చరించారు. లఖిసరాయ్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను విజయ్ కుమార్ సందర్శిస్తున్న సమయంలో ఆయన కారును కొందరు వ్యక్తులు అడ్డుకునే యత్నం చేశారు. విజయ్ కుమార్ వాహనంపై చెప్పులు, పేడ విసరడంతో పాటు, ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. విజయ్ కుమార్ సిన్హా వాహనం ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి వీడియో వైరల్‌గా మారింది. తన నియోజకవర్గంలో ఓ పోలింగ్ బూత్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆర్జేడీ కార్యకర్తలు ప్రయత్నించారని, దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక యంత్రాంగం చర్యలు తీసుకోలేదని విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి జనసమూహాన్ని వెనక్కి నెట్టి, విజయ్ కుమార్ సిన్హా కాన్వాయ్‌ను సురక్షితంగా అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనపై ఎలక్షన్ కమిషన్ స్పందించింది. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీహార్ రాష్ట్ర డీజీపీని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదేశించినట్టు ఈసీ తెలిపింది.

## చర్చలు ఫలించకపోతే యుద్ధమే..

(మొదటి తరువాయి)



మిలిటెంట్లకు కాబూల్ ఆశ్రయం కల్పిస్తోందని, సీమాంతర దాడులను ప్రోత్సహిస్తోందని పాక్ మంత్రి దుయ్యబట్టారు. అయితే ఖవాజా వ్యాఖ్యలను అఫ్గాన్ తీవ్రంగా ఖండించింది. సామాన్యులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతోందని మండిపడింది. కాగా టర్కీలోని ఇస్తాంబుల్ వేదికగా అఫ్గాన్–పాక్ మధ్య నేడు మూడోవిడత శాంతి చర్చలు జరగనున్నాయి. దీనికి ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. అంతకుముందు దోహా, ఇస్తాంబుల్‌లో రెండు విడతల్లో జరిగిన శాంతి చర్చల్లో ఎలాంటి ఒప్పందాలు జరగలేదు. అఫ్గాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు.. పాక్ ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఓరక్‌జాయ్ జిల్లాలో ఇటీవల దాడులు చేశారు. ఈ దాడుల్లో లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది సైనికులు మరణించారు. ఈ నేపథ్యంలోనే అఫ్గాన్ రాజధాని కాబుల్‌లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లకు పాకిస్థాన్ కారణమని తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ క్రమంలోనే తాలిబన్ సైన్యం పాకిస్థాన్‌పై దాడులకు దిగింది. దాంతో పాకిస్థాన్ ఎదురుదాడులు జరిపింది. ఈ ఘర్షణల్లో ఇరువైపులా భారీ ప్రాణనష్టం జరిగింది. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

(మొదటి తరువాయి)



సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశంచేసినట్లు తెలుస్తోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలువబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. మంత్రులు, పార్టీ నాయకులు అందరూ మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి గట్టిగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. మంత్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోజుకో సర్వేను వదులుతూ ప్రజలను, ఓటర్లను బీఆర్ఎస్ సోషల్ మీడియా గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఫీల్డ్ లో కాంగ్రెస్ కు బలం ఉందని, నవీన్ యాదవ్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని గ్రౌండ్ రిపోర్టులు చెబుతున్నాయని అన్నారు. ప్రచారానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉందని, ప్రతి గంటనూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఓటరుకు మన వాయిస్ చేరాలని అన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేర్చే బాధ్యతను మంత్రులు, పార్టీ నాయకులు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో పోల్ మేనేజ్మెంట్ పై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటి వరకు సాగిన ప్రచారంపై రివ్యూ చేశారు. ఈ సెగ్మెంట్ లో పోలింగ్ పర్సంటేజీ పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం ఈ రివ్యూలో సూచించినట్టు సమాచారం. ఇక్కడ మొత్తం 4,01,365 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,08,561మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీళ్లంతా 139 పోలింగ్ కేంద్రాల్లోని 407 పోలింగ్ బూత్ లలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ చాలా తక్కువగా పోలింగ్ శాతం నమోదవుతోంది.ఇక్కడ 2009 లో 52.76శాతం , 2014లో 50.18, 2018లో 45.59 2023లో 47.49 శాతం పోలింగ్ నమోదవుతోంది. దానిని పెంచడం, ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం చెప్పినట్టు సమాచారం. దీంతో పాటు బస్తీల వారీగా పరిస్థితిని కూడా సీఎం సమీక్షించినట్టు తెలుస్తోంది.

# మాజీ క్రికెటర్లు సురేష్ రైనా,శిఖర్ ధావన్‌లకు ఈడీ షాక్..

### బెట్టింగ్ యాప్ కేసులో ఆస్తులు అటాచ్..!



**న్యూఢిల్లీ –**

భారత మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. బెట్టింగ్ యాప్ కేసులో ఇద్దరికి చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ సైట్ వన్ ఎక్స్‌బెట్ (1xBet)కు సంబంధించిన కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల విలువైన స్థిరాస్తిని, రూ.6.64 కోట్ల విలువైన రైనా మ్యూచువల్ ఫండ్స్‌ను జప్తు చేసేందుకు ఈడీ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లను ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నించింది. దర్యాప్తు సమయంలో వారి వాంగ్మూలాలు నమోదు చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన పలు కేసులను ఈడీ ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నది. ఇలాంటి బెట్టింగ్ యాప్స్ చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు దోహదపడుతాయని కేంద్ర దర్యాప్తు సంస్థ భావిస్తున్నది. ఈ యాప్‌లో లక్షలాది మంది వ్యక్తులు, పెట్టుబడిదారులను రూ.కోట్లు మోసం చేశాయని, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. బెట్టింగ్స్ యాప్స్‌కు మద్దతుగా పలువురు ప్రముఖ సినీతారలు, క్రికెటర్లు ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఇప్పటికే నమోదైన కేసుల ఆధారంగా రంగంలోకి విచారణ జరుపుతున్నది. ఇందులో భాగంగా పలువురు సినీ తారలు, మాజీ క్రికెటర్ల పాత్రపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఇప్పటికే పలువురు నటీనటులు, క్రికెటర్లకు నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. 1xBet, దాని ప్రతినిధులను బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా ఇద్దరు మాజీ క్రికెటర్లతో ఎండార్స్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లుగా ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ ఇద్దరితో పాటు ఇదే బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో గతంలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటీనటులు సోనుసూద్, ఊర్వశి రౌతేలా, మిమి చక్రవర్తి, అంకుష్ హజ్రాతో పాటు పలువురిని ప్రశ్నించిన విషయం తెలిసిందే.

# జూబ్లీహిల్స్‌లో ఎవరి ధీమా వారిది

(మొదటి తరువాయి)

ప్రతి విమర్శలతో ఈ ఉప ఎన్నిక వేడెక్కింది. గెలిస్తే కాంగ్రెస్‌కు పరువు ఉంటుంది. తమ పథకాలకు ప్రజలు ఆమోదిస్తున్నారని, పాలనను మెచ్చుకుంటున్నారని చెప్పుకోవచ్చు. బిఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసే అవకాశం మరింత పెరుగుతుంది. ఎంతమంది వచ్చినా ప్రజలు తమ వెన్నంటే ఉన్నారని చెప్పుకోవచ్చు. ఇక బిజెపి గెలిస్తే నరేంద్రమోడీ ఛరిష్మా అని ప్రచారం చేసుకుంటారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అంటారు. ఎన్నికల తరవాత ఇవే ప్రకటనలు కొంచెం అటుఇటుగా ఉంటాయి. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఓటరు మహాశయుడు మరిచిపోలేదు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన దురాగాతాలను కూడా గమనిస్తూనే ఉన్నాడు. ఇక, సమయం వచ్చింది. రేవంత్ బుల్డోజర్ పాలనకు తమ సిరా చుక్కతో బుద్ధి చెప్పాలని

జూబ్లీహిల్స్ ఓటర్లను బిఆర్ఎస్ కోరుతోంది. మరో నాలుగు రోజుల్లో జరుగనున్న ఉప ఎన్నికలో హస్తం పార్టీ 30వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తుందని సిఎం రేవంత్ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలా పిలిచే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. దురదృష్టవశాత్తు ఆయన అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తి రేకెత్తిస్తున్నది. ఇక మైనార్టీలు ఎక్కువగా ఉన్న జూబ్లీహిల్స్‌లో ఆ వర్గం ఓటర్లను ఆకట్టుకోవడానికి అజారుద్దీన్‌కుఅ త్యవసరంగా మంత్రి పదవి కట్టబెట్టారు. దీంతో వారి మద్దతు కొంత కాంగ్రెస్ సాధించిందనే చెప్పాలి. ఎంఐఎం కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం కలిసివచ్చే అంశం. ఓటర్లు ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఓటేసే అవకాశాలు ఉన్నాయని బిజెపి, బిఆర్ఎస్ ఆశగా ఉన్నాయి. ఇదే సందర్భంలో బిఆర్ఎస్ సొంత సర్వేలతో హడలెత్తించే ప్రయత్నంలో ఉంది. ప్రతి సర్వేలోనూ కారు దూసుకుపోయినట్టు ఉందని చెబుతోంది. . జూబ్లీహిల్స్ ఓటర్లలో 48 శాతం మంది కేసీఆర్ పార్టీకి మద్దతు ప్రకటించగా.. కాంగ్రెస్‌కు 42శాతం, బీజేపీకి 9శాతం మంది ఓటేస్తారని ముందే చెప్పుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురనున్నట్టు సర్వే తేల్చిందని ప్రచారం చేసుకుంటున్నారు. రేవంత్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా?, కేసీఆర్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఇక్కడ ఉత్పన్నం కానేకాదు. ఎందుకంటే ఇక్కడ ప్రభుత్వ అజమాయి షీయే ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే ఉప ఎన్నికల్లో అనుకూలత ఉంటుంది. కాబట్టి కొంత అటుఇటుగా మాత్రమే మెజార్టీ ఉన్నా గెలుపు అవకాశాలు ఎక్కువగా అధికార పార్టీకి ఉంటుంది. ఇకపోతే ఇక్కడ ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఇది ప్రజలకు కూడా బాగా తెలుసు.

## జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

(మొదటి తరువాయి)

గ్యారంటీలను గానీ, 400 పైచిలుకు హామీల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించడం లేదని, వ్యక్తిగత విమర్శలు చేయడంపైనే దృష్టి పెడుతోందని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదని.. అందుకే సర్వేల్లో కూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు గతంలో పాలించిన బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు. 'ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి 'ఇజ్జత్' అంటావు, మరి హిందువులు ఇజ్జత్ కాదా మిస్టర్ రేవంత్ రెడ్డి? మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు గౌరవం లేదా? ఎర్రగడ్డలో ఖబరస్థాన్ కోసం స్థలం ఇచ్చేందుకు మనసొచ్చింది కానీ, బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి గుడికి 50 గజాలు స్థలం ఇవ్వడం ఎందుకు కుదరలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవు. ఎన్నాళ్లు మజ్లిస్‌ను భుజాన ఎక్కించుకోని తిరుగుతావో తిరుగు. ప్రజలే నీకు గట్టి బుద్ధి చెబుతారని అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఓటు వేయక పోతే సన్న బియ్యం, ఫ్రీ బస్ ఆగిపోతుంది అని సీఎం అన్నారు.. సన్నబియ్యం లో కేంద్ర ప్రభుత్వానిదే సింహభాగం.. ఏ విధంగా సీఎం అపుతారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సకల సమస్యలకు పరిష్కారం ఫ్రీ బస్సు అనే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన నిధులను, వచ్చిన సంస్థల వివరాలు కిషన్‌రెడ్డి వివరించారు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో బీబీనగర్ ఎయిమ్స్ భవనాలు ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2 వందల బస్తీ దవాఖానలు కేంద్రం సహకారంతో నడుస్తున్నాయి. కేసీఆర్ పేరు మార్చారని అన్నారు.

## 7 కాదు 8 జెట్లు కూలాయి..

(మొదటి తరువాయి)

చెబుతున్న ట్రంప్.. ఇప్పుడు ఎనిమిదిగా పేర్కొన్నారు. మియామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరంలో పాల్గొన్న ట్రంప్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా తనను తాను ప్రపంచ శాంతికర్తగా చెప్పుకున్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## ఏపీలో మెడికల్ విద్య ప్రైవేటీకరణ

(మొదటి తరువాయి)

రూ.20 వేల చొప్పున అందించాం. పేద కుటుంబాలు అప్పుల పాలు కాకుండా చూశాం అని గుర్తుచేశారు. పేదలకు చదువు భారం కాకూడదు. కానీ ఈ ప్రభుత్వం అన్నింటినీ ధ్వంసం చేస్తోంది. పిల్లలు చదవకూడదనే ఉద్దేశంతో చంద్రబాబు పనిచేస్తున్నారు. రూ.4,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.2,200 కోట్ల వసతి దీవెన పెండింగ్‌లో ఉంచారు. మా హయాంలో ప్రభుత్వ రంగంలోనే 6.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.2 లక్షల మందికి ఉపాధి కల్పించాం, అని మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు.



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో భాగంగా ప్రచార శైలిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి వివరిస్తున్న ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్.

# శాంతియుత జగద్గిరిగుట్ట కోసం అఖిలపక్ష పిలుపు



**జగద్గిరిగుట్, నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జగద్గిరిగుట్టలో ఇటీవల చోటుచేసుకున్న హత్య ఘటనపై అఖిలపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. బుధవారం నాడు జరిగిన దారుణ ఘటన సభ్య సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసిందని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమైన నాయకులు సంఘటనను ఖండిస్తూ, జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ అప్పారావు గారికి మెమోరాండం సమర్పించారు. జగద్గిరిగుట్ట మినీ తెలంగాణగా పేరుపొందిన ప్రాంతమని, రాష్ట్రవ్యాప్తంగా వలస వచ్చిన కార్మికులకు నిలయంగా మారిందని, అందరూ కలిసిమెలిసి జీవించే ప్రాంతంగా గుర్తింపు పొందిందని నాయకులు పేర్కొన్నారు. అయితే గంజాయి వ్యాప్తి కారణంగా గత మూడేళ్లుగా ప్రతి సంవత్సరం హత్యలు, దాడులు జరుగుతున్నాయని, దీనివల్ల జగద్గిరిగుట్టకు చెడ్డ పేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే కొత్తవాళ్లు ఇక్కడికి రావడానికి వెనుకాడతారని, దీని ప్రభావం స్థానిక ప్రజల జీవనంపై పడుతుందని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకతీతంగా ప్రతి బస్తీలో పెద్దలు, యువకులు కలిసి గంజాయి నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, ఖాళీ ప్రదేశాల్లో గస్తీని పెంచాలని, గంజాయి విక్రయదారులను బహిష్కరించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. జగద్గిరిగుట్టను గంజాయి లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ ముందుండాలని, పౌర సమాజం తోడుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ నెల 11న అన్ని బస్తీ కమిటీలతో సమావేశం నిర్వహించి గంజాయి నిర్మూలనపై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, కాంగ్రెస్, టిఆర్ఎస్, ఏఐటీయూసీ, జనసేన, ఎంఆర్పిఎస్, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, కాంగ్రెస్ నాయకులు సాయి పంతుల, టిఆర్ఎస్ నాయకులు సాజిద్, జనసేన నాయకులు సతీష్, మహాజన జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకట్, సిపిఐ సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు సదానంద్, కే వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, మైనారిటీ నాయకులు ఇమామ్, జంబు, భాస్కర్, మల్లేష్, నరసింహ, బాబు తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన



**చింతల్, నవంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

చింతల్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మహ్మద్ రఫీ తెలిపారు. 128 డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నిన్న రాత్రి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంబేద్కర్ విగ్రహం నుంచి పోచమ్మ గుడివైపు నీటి ప్రవాహం సజావుగా ఉండేలా లెవెల్ చూసుకోవాలని సూచించారు. డ్రైనేజీ మాన్‌హోల్‌లో సిమెంట్ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి విద్యార్థులకు టై, బెల్ట్,బ్యాడ్జీ పంపిణీ



**తెలకపల్లి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

తెలకపల్లి మండలంలోని పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక బాధ్యతగా స్వయంగా ఖర్చు చేసి బుగ్గ స్వామి దంపతులు 200 మంది విద్యార్థులకు ఈ వస్తువులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు దీటుగా కనిపించాలి, అన్ని రంగాల్లో ముందుండాలి అనే సంకల్పంతో ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బుగ్గ స్వామి మాట్లాడుతూ 'పెద్దపల్లి విద్యార్థులు ఇది మాకు లేదు అనే భావన కలగకుండా, సమాన అవకాశాలు కలగాలన్నదే లక్ష్యం. ప్రభుత్వ విద్యార్థులు గర్వంగా ముందుకు సాగాలి' అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణశ్రీ, శ్రీనివాస్, చాంద్ పాషా, మల్లేష్ గౌడ్, చంద్రశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు. గ్రామ యువకులు బొల్లె జగన్, స్వామి, మల్లేష్ తదితరులు హాజరయ్యారు.

# పళ్లెంలో స్కానర్.. డిజిటల్‌గా కట్నం!




**ఎలిగేడు, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నేటి ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యువత చేతుల్లోకి వచ్చి డిజిటల్ రంగంలో విస్తృతంగా విస్తరిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య, వ్యాపార రంగాలు అన్నీ డిజిటల్ లావాదేవీలను స్వీకరించాయి. ఇక కుటుంబ ఆచారాలు, సంప్రదాయాలు కూడా ఈ మార్పుకు లోనవుతున్నాయి. గతంలో ఇంటికి వచ్చిన నూతన దంపతులకు, ఆడబిడ్డకు పళ్లెంలో చీర, కట్న కానుకలు అందించి గౌరవించేవారు. కానీ నేటితరం యువత డిజిటల్ సౌకర్యాలను వినియోగించుకుంటూ పళ్లెంలో స్కానర్ ఉంచి, "ఇది మా ఆడబిడ్డ కట్నం.. స్కాన్ చేసి చెల్లించండి!" అని అడిగే స్థాయికి చేరుకుంది. ఇది వినగానే నవ్వొస్తుంది కానీ, డిజిటల్ యుగంలో ఇది సాధ్యమే. రానున్న రోజుల్లో సంప్రదాయాలూ, ఆచారాలూ స్కానర్‌కి అనుసంధానమవుతాయనడంలో సందేహం లేదు!

# అభివృద్ధి దిశగా గచ్చుబావి శివాలయం

## దేవాలయాన్ని దర్శించుకున్న టాస్క్ సీవోవో సుంకిరెడ్డి












**శంషాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పురాతన దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గురువారం శంషాబాద్‌లోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ, కోనేరు శుద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ నమూనా ఆధారంగా కల్వకుర్తి గచ్చుబావిలోని చారిత్రక శివాలయాన్ని పునరుద్ధరించేందుకు ఆలయ కమిటీతో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు స్థానిక భక్తుల నమ్మకాన్ని బలపరిచే దిశగా కోనేరు శుద్ధి, పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, సాయి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపల్లిగూడలో సహస్ర దీపాలంకరణ మహోత్సవం



**మంచాల, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కార్తీక పౌర్ణమి సందర్భంగా తాళ్లపల్లిగూడ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సహస్ర దీపాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో వేయిన్నూట పదహారు దీపాలను వివిధ ఆకృతులతో అలంకరించారు. అనంతరం శివ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. మహాన్యాస రుద్రాభిషేకం, రాత్రి భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీఆర్ వన్ ఫౌండేషన్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆమనగల్లు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



**ఆమనగల్లు, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించిన రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలిత, కందుకూరు డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ గీతతో కలిసి పలు విభాగాల్లో తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో నమోదైన విషజ్వరాల కేసులు, అందించిన చికిత్స వివరాలు, ఓపీ, ఐపీ, గర్భిణీ స్త్రీల రికార్డులు, కుక్క, పాము, కోతి కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్ వివరాలను పరిశీలించారు. సిహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాము, కుక్క, కోతి కాట్లకు అవసరమైన మందులు అందుబాటులో ఉండాలంటూ సూచనలు చేశారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది విధుల్లో అలసత్వం లేకుండా పనిచేయాలని ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా ప్రోగ్రాం అధికారి అక్రమ్, డ్రాయింగ్ ఆఫీసర్ మైమునబేగం, వైద్యులు మంజులాదేవి, నాగరాజు, డెంటల్ వైద్యాధికారి జయశ్రీ, హెడ్ నర్స్ ఏసుమణి, నర్సింగ్ ఆఫీసర్లు సునీత, దేవేందర్, సాయి లక్ష్మి, కృష్ణలీల, మధు, ఫార్మాసిస్ట్ ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ వేణు, వైద్య సిబ్బంది మునీర, గోపాల్ రెడ్డి, హనుమంతు, గుజ్జరి శ్రీను, సురేష్, మంగ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖకు భూమి రిజిస్ట్రేషన్ చేసిన రైతు కమిషన్ ఛైర్మన్





**ఇబ్రహీంపట్నం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇచ్చిన మాట ప్రకారం తన సొంత భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేసిన రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి. ఈరోజు ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారికంగా వ్యవసాయ శాఖకు భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. రెండు నెలల క్రితమే తన స్వగ్రామమైన యాచారం గ్రామంలో 4 కోట్ల రూపాయల విలువైన 2 వేల గజాల స్థలాన్ని, అందులోని భవనంతో సహా వ్యవసాయ శాఖకు రాసివ్వనున్నట్లు ప్రకటించారు. యాచారం మండలంలోని రైతులు పండించే ఉత్పత్తుల నిల్వ, వ్యవసాయ పరికరాలు, పనిముట్లు భద్రపరచడానికి ఈ స్థలం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించి, శాశ్వతంగా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వానికి రాసివ్వాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంతకుముందే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి ఈ విషయాన్ని వివరించారు. అధికారిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ రోజు ముగిసింది. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ హర్షన్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ తరఫున రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా, ఏడీఏ సుజాత, ఏవో రవినాథ్ పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత యాత్రకు ఉస్మానియా విద్యార్థి ఎంపిక




**హైదరాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశ సమైక్యతను బలపరిచే లక్ష్యంతో నిర్వహించబడుతున్న అంతర రాష్ట్ర జీవన అనుభవ యాత్ర- ఎస్ఈఐఎల్ (స్టూడెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్ స్టేట్ లివింగ్) కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి, అఖిల భారత విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు దృహన్ తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు.దేశ నలుమూలల నుండి 70 మంది ప్రతినిధులు పాల్గొననున్న ఈ యాత్ర ద్వారా వేషాలు, భాషలు, ఆచారాలు, ఆహార అలవాట్లు వేరైనా మనమంతా ఒకే దేశానికి చెందినవాళ్లమన్న భావనను బలపరచే ప్రయత్నం జరుగుతుంది. ఉత్తర తూర్పు రాష్ట్రాలైన సెవెన్ సిస్టర్స్ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవనశైలి తదితర అంశాలపై అవగాహన పెంపొందించేందుకు అక్కడి కుటుంబాలతో కలిసి జీవిస్తూ అనుభవాలను పంచుకోవడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. దేశ విభజన శక్తులు భూభాగాన్ని దేశానికి చెందదంటూ ప్రచారం చేస్తున్న తరుణంలోఈ యాత్ర ద్వారా "మనమంతా భారతదేశ వాసులమే" అనే సందేశాన్ని స్పష్టంగా తెలియజేయనున్నారు.దృహన్ ఎంపికపై ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

# తూప్రాన్‌లో వీధి కుక్కల నియంత్రణ చర్యలు




**తూప్రాన్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో వీధి కుక్కల స్వైర విహారం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్క కాటుకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘం చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆదేశాల మేరకు బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ సహకారంతో 1వ వార్డు, 2వ వార్డు, 3వ వార్డు, 4వ వార్డు, 5వ వార్డు, 6వ వార్డు, 12వ వార్డు ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టించి స్టెరిలైజేషన్ కోసం పంపించారు. ఈ చర్యల ద్వారా కుక్కల సంఖ్య నియంత్రణలోకి రావడంతో పాటు ప్రజలకు భద్రత కలగనుంది. పురపాలక సంఘం తరఫున వీధి కుక్కల సమస్యపై మరింత కృషి చేయనున్నట్లు సమాచారం.

# అవుట్సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా



**తూప్రాన్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాద బీమా పాలసీని ప్రారంభించారు. ప్రమాదవశాత్తు ఏదైనా అనుకోని ఘటన జరిగితే వారి కుటుంబాలకు ఆర్థిక అండగా నిలిచేందుకు తూప్రాన్ పురపాలక సంఘం తరఫున పోస్టాఫీస్ ద్వారా ఈ బీమా పాలసీని అమలు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య చేపట్టారు. కార్మికుల సంక్షేమం కోసం పురపాలక సంఘం కట్టుబడి పనిచేస్తున్నదని అధికారులు తెలిపారు.

# జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన పెద్దపులి నాగారం విద్యార్థులు



**మహేశ్వరం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో టిఎస్‌ఏటి మరియు టిజిహెచ్ఎంఎ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఎండి ఫయాజ్ జిల్లా స్థాయికి, స్రవంతి మండల స్థాయికి ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. విద్యార్థుల ఎంపిక సందర్భంగా పెద్దపులి నాగారం హై స్కూల్ యజమాన్యం, ప్రిన్సిపల్ వెంకటయ్య గౌడ్, గ్రామ పెద్దలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలి

-బిఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్షులు అకారపు నరేష్.




**దేవరకొండ నవంబర్ 06. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని కళ్లకు నల్ల రిబ్బన్స్ కట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరంఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ మాట్లాడుతూ ,తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు దాదాపు 6 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం తన ఎన్నికా ప్రణాళికల్లో (మానిఫెస్టో) స్పష్టంగా హామీ ఇచ్చినప్పటికీ, ఈ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో పూర్తి అశ్రద్ధ చూపుతోంది. ఈ ఆలస్యం వల్ల విద్యార్థులు భారీ మొత్తాల్లో ఫీజు రుణాల్లో చిక్కుకుని, చదువు ఆపివేసే పరిస్థితికి నెలకొంది, ప్రభుత్వం ఇచ్చిన హామీలను మోసం చేయడమే కాక, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారన్నారు అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయడం లేదని అన్నారు. విద్యార్థుల పైన ఎందుకు ఇంత కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు అదే విదంగా ఒక వైపు ప్రైవేట్ కాలేజీ లు స్కాలర్షిప్ల కోసం బంద్ నిర్వాహిస్తుంటే మరోపక్క రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళాశాలలపై విజిలెన్స్ దాడులు నిర్వాహిస్తు ప్రైవేట్ కళాశాల యజమాన్యాన్ని బ్లాక్ మెయిల్ చేయిస్తు వేదిస్తున్నా పరిస్తితి ఉంది . విద్యార్థులు పై చదువుల కోసం సర్టిఫికెట్లు అడిగితే ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం డబ్బులు కడితేనే మేము సర్టిఫికెట్లు ఇస్తాం అని విద్యార్థులను చాలా ఇబ్బందులు పెడుతున్నటువంటి పరిస్థితి ఉంది కాబట్టి తక్షణమే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేనియెడల స్థానిక మంత్రులను, ఎమ్మెల్యేలాను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్,వేణుదార్, మనోహర్, యశ్వంత్, జయంత్, సుందర్, అశోక్, మంజుల, హేమ, రజిత, అశ్విని, గీత, అనురాధ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ విద్యార్థుల ఎంపిక







**హుస్నాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నారాయణపేట జిల్లా కోసిగీలో ఈ నెల 7 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న 69వ పాఠశాల క్రీడా సమాఖ్య 17 సంవత్సరాల బాలబాలికల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గౌరవేణి రిశ్వంత్ (10వ తరగతి), ఎండి సానియా (10వ తరగతి) ఎంపికయ్యారు. సెప్టెంబర్ 16న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థులు చూపిన ప్రతిభను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పాఠశాల శారీరక విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను సిద్దిపేట జిల్లా గ్రంథాలయం చైర్మన్ కేడేమ్ లింగమూర్తి, మండల విద్యాధికారి బండారి మనీలా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, కబడ్డీ కోచ్ కృష్ణ అభినందించారు.

# టీఎన్జీవో జిల్లా సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చ



**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగింది. 1-9-2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం, ఉద్యోగులపై దాడులు, 317 జీవో ప్రభావం వంటి అంశాలపై సమావేశంలో విశదంగా చర్చించారు. పెన్షన్ అనేది బిక్ష కాదు, ప్రభుత్వ సేవ చేసిన ఉద్యోగికి ఇవ్వాల్సిన హక్కు అని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం వల్ల ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఏసీబీ దాడుల్లో నిర్దోషులు బలిపశువులుగా మారకుండా న్యాయపరమైన విచారణ జరగాలని సూచించారు317 జీవో వల్ల పదోన్నతులు నిలిచిపోవడం, హెచ్ఆర్ఏ తగ్గడం, కుటుంబాలు విడిపోవడం వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమాన్ని రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా తీసుకోవాలని తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం లక్ష్మణరావు, కేంద్ర, జిల్లా, మండల, పట్టణ, గ్రామ స్థాయి నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్ ఆవిష్కరణ




**మాడుగుల, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జన విజ్ఞాన వేదిక -తెలంగాణ ఆధ్వర్యంలో 2025 -26 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్‌ను మాడుగుల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సర్దార్ నాయక్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఒక పరీక్ష మాత్రమే కాదు, ఇది విద్యార్థులలో విజ్ఞానాన్ని, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే ఒక సైన్సు ఉత్సవం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరిచి మాడుగుల మండలానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు, చెకుముకి పరీక్ష నిర్వాహకులు, ఇర్విన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లండపర్వతాలు, మాడుగుల జిహెచ్ఎం సుదర్శన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవరకొండలో కరాటే శిక్షణ కార్యక్రమానికి మంచి స్పందన



**దేవరకొండ, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.టి. ఈ తరగతులకు శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. కరాటే శిక్షణ ద్వారా శారీరక సామర్థ్యం, బలం, చురుకుదనం, వేగం, సమన్వయం, వశ్యత పెరుగుతుందని, మానసికంగా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, ఆత్మనియంత్రణ, సమస్యలను ఎదుర్కొనే శక్తి పెంపొందుతుందని నిర్వాహకులు వివరించారు. ముఖ్యంగా మహిళలకు ఇది ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఇది సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ శిక్షణను మాస్టర్ పి. గోపి నాయక్ అందిస్తున్నారు. ఆయనకు 18 సంవత్సరాల అనుభవం ఉంది. కరాటేతో పాటు జూడో, బాక్సింగ్, ఆయుధ వినియోగం, ఆత్మరక్షణ శిక్షణను కూడా అందిస్తున్నారు. శిక్షణ పొందాలనుకునే వారు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనాన్ని సంప్రదించవచ్చు.

# అవి నా ఫొటోలే..

## రాహుల్‌గాంధీ విమర్శలపై స్పందించిన బ్రెజిల్ మోడల్

**న్యూఢిల్లీ - నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హర్యానాలో పది బూత్‌ల్లో నకిలీ ఓట్ల కోసం బ్రెజిల్ మోడల్ లారిస్సా ఫొటోలను ఉపయోగించారని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ చేసిన విమర్శలపై ఆమె స్పందించారు. ఆ ఫోటోలు తనవేనని, తన పాత ఫొటోలను దుర్వినియోగం చేశారనే విషయం తనకు తెలియదని లారిస్సా తెలిపారు. భారత్‌లో ఎన్నికల గురించి తనకు ఏమీ తెలియదని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. పోర్చుగీస్ భాషలో ఆమె మాట్లాడారు. హర్యానా ఓటర్ల జాబితాలో తన ఫోటోను అనేక సార్లు ఉపయోగించారనే విషయం తెలిసి తాను దిగ్భ్రాంతికి గురైనట్లు లారిస్సా వెల్లడించారు. తన 18, 20 ఏళ్ల వయసులోని ఫొటోలను వినియోగించారని తెలిపారు.

# మానకొండూరులో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



**మానకొండూర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని దేవంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 11వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ 2025 అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 3 పరిధిలోని సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల 12 రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ప్రిన్సిపాల్ జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తన్నీరు సత్యనారాయణ దశ దిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ,నవంబర్ 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులు అర్పించి మాజీ మంత్రి ని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**జూబ్లీహిల్స్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం షేక్‌పేటలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో పట్టు కోసం బీఆర్ఎస్, బీజేపీ పాకులాడుతున్నాయని, కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి కనిపించలేదని, బీజేపీ వల్ల అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు .ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రతినిధి అన్నమనేని నర్సింగరావు, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్ బకాయిలపై ఎస్ఎఫ్ఐ నిరసన



**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ భిక్ష కాదు, హక్కు అని జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ పేర్కొన్నారు. కళాశాలలు మూసివేసి యాజమాన్యాలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కమిటీలు పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం, ముఖ్యమంత్రి తన గుప్పెట్లోనే శాఖను ఉంచుకుని విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆసపెల్లి వినయ్ సాగర్, గట్టు ఆకాష్, దుర్గం భోగేష్, సందేశ్, అక్షయ్, అజయ్, మహేష్, సంతోష్, మణికంఠ, తేజ, ఈశ్వర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలి

-విద్యార్థి సంఘాల నాయకులు

-విద్యాసంస్థలు బంద్ పాటిస్తే దేశ భవిష్యత్తుకు మూలమైన విద్యార్థుల చదువు దెబ్బతింటుంది- రమేష్





**వనపర్తి నవంబర్ 06( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానం నుంచి రాజీవ్ చౌక్, బస్ డిపో రోడ్ ద్వారా కొత్త బస్టాండ్ వరకు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఆర్ఎస్వి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ రాస్తారోకో నిర్వహించారు. ఆధ్వర్య నాయకులు రమేష్, గణేష్, వీరయ్య, యశ్వంత్ మాట్లాడుతూ ఇటీవల ఐదు –ఆరు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న రూ. 8,300 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారి ఆరోపణల ప్రకారం, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ ఉంచి పేద విద్యార్థులు చదువుకు దూరత పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి ఎన్నికల ముందే స్కాలర్షిప్స్ చెల్లిస్తామని హామీలు ఉన్నప్పటికీ రెండేళ్లలోనూ నిధులు విడుదల చేయకపోవడం గురించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వీరియు వెంటనే నిధులు విడుదలకదా విద్యార్థులంతా ఐక్యమై మరింత ఉధృతంగా పోరాటం చేపెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఆర్ఎస్వి నాయకులు గోపాలకృష్ణ, వంశీ, దినేష్, సూర్యవంశం గిరి, అరవింద్, బన్నీ, వీరన్న సమేత అనేక విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో సిద్దిపేట కలెక్టర్ హైమావతి పర్యటన



**సిద్దిపేట, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. కుకునూరు పల్లి, కొండపాక మండలాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. వంట గదిలో ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు రుచికరంగా, శుభ్రంగా భోజనం అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, స్కావెంజర్లపై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, అవసరమైన వసతులు అందించాలని సూచించారు. వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసీ కేటాయించిన భూమిలో సర్వే నంబర్ల విషయంలో తలెత్తిన సమస్యను పరిశీలించి, సర్వే అధికారులు హద్దులు ఖరారు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధి క్రమంలో ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవల నాణ్యతను పరిశీలించారు. ఓపీ పెంచాలని, మెడిసిన్ కొరత లేకుండా చూడాలని, నీటి లీకేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

## వందేమాతర గీతానికి 150 ఏళ్లు

**నేడు సామూహిక గీతాలాపన**



**మంచిర్యాల, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతర గేయ రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో మాట్లాడుతూ, బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో కూడా సామూహిక గీతాలాపన నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వివరాలను అదే రోజు సాయంత్రం ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# హుస్నాబాద్ -కరీంనగర్ రోడ్డులో గుంతల మయం

**ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆగ్రహం**







**హుస్నాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు హుస్నాబాద్ పట్టణం నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నా, అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యుడు, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. “ఇక్కడి రోడ్లను పట్టించుకోలేని వారు రాష్ట్రాన్ని ఎలా చూసుకుంటారు?” అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచైనా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి రోడ్లను మరమ్మతు చేయించాలని కోరారు. ప్రజలు ప్రమాదాలకు గురైతే బాధ్యత ఎవరిది? అని నిలదీశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు.

## హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో కార్తీక దీపోత్సవం



**హుస్నాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్‌లో గురువారం కార్తీక మాస దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో ప్రజలు, ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఉత్సవాల ద్వారా గుర్తుచేసుకుంటారని ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి పేర్కొన్నారు. కార్తీక మాసంలో చన్నీటి స్నానం, శాఖాహార భోజనం, ఉసిరికాయ సేవించడం, తులసి –ఉసిరి మొక్కలు నాటడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. విద్యార్థులు రంగవల్లుల మధ్య దీపాలతో అలంకరణ చేసి ఆకట్టుకున్నారు. కళాశాల ప్రాంగణంలో ఉసిరి మొక్కలు నాటారు. స్వయంగా తయారు చేసిన తీపి పదార్థాలు, పులిహోరను కలిసి భుజించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్ కుమార్, నైనా దేవి, బాలరాజు, చంద్రమౌళి, సుధా మాధురి, రాజలక్ష్మి, లక్ష్మి, సబీ ఫాతిమా, కుమారస్వామి, శ్రీనివాస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బహదూర్‌పల్లిలో చెత్త వేయడంతో వ్యక్తికి జరిమానా



**దుండిగల్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లి వార్డులో రోడ్డుపైన చెత్త వేస్తున్న వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి, వారికి 1000 జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం నేరమని, అలాంటి చర్యలకు పెనాల్టీ తప్పదని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త –పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, జవాన్ సురేందర్ పాల్గొన్నారు.

# తన్నీరు సత్యనారాయణరావు కు నిరంజన్‌రెడ్డి నివాళులు



**వనపర్తి నవంబర్ 06( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
మాజీ మంత్రి టి.హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు దశదిన కర్మ ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై తన్నీరు సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి వెంట నాగం తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవంగా మైసిగండి మైసమ్మ ఉత్సవాలు

**- పూజలు చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు**
**- భారీగా తరలివచ్చిన భక్తులు**





**కడ్తాల్, నవంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రతియేటా కార్తీక పౌర్ణమిలో నిర్వహించే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్ పర్సన్ సిరోలి పంతు, ఈఓ శ్నేహలత, తహశీల్దార్ జ్యోతి, శ్రీరాములు, అమృ నాయక్, పాండు నాయక్, జావర్ లాల్, లింగప్ప, భాస్కర్, అరుణ్, పూజారులు యాదగిరి, అమూల్యపాటి, సంతోష్ శర్మ, జైనన్ ప్రకాష్, వెంకటరమణ, బిచ్యా నాయక్, శ్రీరాములు, ఆలయ సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్, వెంకటేష్, రవి, భక్తులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జూనియర్ కాలేజీలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




**సిద్దిపేట, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.రాంపల్లి గ్రామానికి చెందిన పెద్దమనిషి బాల మల్లయ్య మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆయన మాటలు విద్యార్థులను ఆకట్టుకుని, చప్పట్లతో ప్రాంగణం మార్మోగింది.ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. చట్టబద్ధంగా లైసెన్స్ పొంది మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, చిన్న తప్పిదం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని సూచించారు.కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ జాగరుకత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు



**మహబూబాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు సైబర్ జాగరుకత దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్లో ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్ట్ టైం జాబ్ మోసాలు, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ మోసాలు, ఇతర ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ గురించి కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పీ. సర్వయ్య, ఎస్సై వి. దీపిక, బ్లూ కోర్ట్ సిబ్బంది ఈర్య, రాందాస్, స్కూల్ ప్రిన్సిపల్ ఉపేందర్ పాల్గొన్నారు.

# హుజురాబాద్ పునర్వైభవానికి ప్రజల మద్దతు అవసరం:

**- ఈటల రాజేందర్**



**హుజురాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కమలాపూర్ మండల కేంద్రంలో బీజేపీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ ఈటల రాజేందర్, హుజురాబాద్ నియోజకవర్గానికి పూర్వ వైభవం తీసుకురావాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈటల మాట్లాడుతూ, "సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను గెలిపించి ఇవ్వండి. సమస్యలన్నీ తీర్చే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. గతంలో అధికారంలో లేకపోయినా అనేక అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జమ్మికుంట బ్రిడ్జి, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, సీఎం రిలీఫ్ ఫండ్, ఇందిరమ్మ ఇల్లు, రోడ్ల నిధులు వంటి అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమంలో హుజురాబాద్ గడ్డ కీలక పాత్ర పోషించిందని, అదే స్ఫూర్తితో ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానన్నారు. "ప్రభుత్వం ఎవరి జాగీరు కాదు, ప్రజల హక్కుల కోసం పని చేయాలి" అని స్పష్టం చేశారు. దళిత బంధు, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు తన వల్లే వచ్చాయని, ప్రజల మద్దతుతో మరిన్ని అభివృద్ధి పనులు సాధ్యమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, "వారికి ప్రేమతో కాదు, ఓడించేందుకు పథకాలు అమలు చేశారు" అని ఆరోపించారు. "డబ్బు, మద్యం రాజ్యానికి ముగింపు పలకాలి. ధర్మానికి ఓటు వేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈటల రాజేందర్ హుజురాబాద్ ప్రజలతో తన 25 ఏళ్ల అనుబంధాన్ని గుర్తుచేస్తూ, "మీ దిక్కు నేను ఉన్నానని మర్చిపోవద్దు" అని హృదయపూర్వకంగా అన్నారు.

# ఖోఖో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన ఎలైట్ ఇండియా సంస్థ



**కల్వకుర్తి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో గత 12 రోజులుగా కొనసాగిన ఖోఖో శిక్షణ శిబిరం ముగిసిన సందర్భంగా, స్టేట్ మీట్‌కు వెళ్తున్న విద్యార్థులకు ఎలైట్ ఇండియా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్రీడా దుస్తులు పంపిణీ చేసింది. హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అవసరమైన దుస్తులు అందించడంతో ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విలియం, ఆర్గనైజర్ గోకమళ్ళ రాజు సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎండీ నాగరాజు మాట్లాడుతూ, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన విధంగా ప్రాజెక్టులు రూపొందించడం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా పేద విద్యార్థులు, క్రీడాకారులకు సేవ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. స్టేట్ మీట్‌లో పాల్గొనబోయే క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎండీ రమేష్ యాదవ్, ఎండీలు రాజేందర్, నగేష్, బాలరాజు, అలాగే వెల్దండ మండల బీఆర్ఎస్ యువ నాయకులు జంగిలి ఆనంద్, జంగిలి ప్రవీణ్, కల్వకుర్తి మండల బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ డొక్కా, లింగమయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థులు



**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హాకీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక గుర్తింపు, దేశాల మధ్య సత్సంబంధాలను పెంపొందించే శక్తిని గుర్తిస్తూ, ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు ఎంపిక కావడం సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తపల్లిలోని పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.హుజురాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులుఅండర్ 14 బాలుర విభాగంలో ఏ. కృతిక్ పటేల్, కే. జయంత్‌బీ బాలికల విభాగంలో కే. యుక్త, ఏ. నైనికా రెడ్డి, ఆకుల ఆశ్రితబీ అండర్ 17 బాలుర విభాగంలో ఏం. రితిక్ రెడ్డి, జి. అక్షిత్‌బీ బాలికల విభాగంలో కే. సాన్విక, జే. వర్షికురాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.వారందరికీ పుష్పగుచ్చాలు అందజేసి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి బాధతో యువకుడి ఆత్మహత్య



**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన ముస్కు శివ (25) అనే యువకుడు తీవ్ర కడుపునొప్పి బాధతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 11 నెలల క్రితం వివాహం అయిన శివ, గత కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ పలువురు వైద్యులను సంప్రదించినా ఉపశమనం కలగకపోవడంతో ఈ నెల 1న గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు.తక్షణమే కరీంనగర్ సన్రైస్ హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ నవంబర్ 6 తెల్లవారుజామున 1:47 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# పోలీసుల చాకచక్యంతో పోయిన ఫోన్ తిరిగి యజమానికి



**కరీంనగర్, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మొగ్దుంపూర్‌లో తన ఒప్పో ఫోన్ పోగొట్టుకున్న కమటం సాయికుమార్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ జగిత్యాలలో ఉన్నదని గుర్తించి పోలీసులు రికవరీ చేశారు. గురువారం రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఫోన్‌ను యజమానికి అప్పగించారు. ఈ రికవరీలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుల్ కీర్తనను సీఐ నిరంజన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆస్తి రక్షణలో పోలీసుల చాకచక్యం ప్రశంసనీయం.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**-కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ,నవంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వర్షాలు తగ్గినందున 17% తేమ వచ్చే విధంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఇందుకుగాను అవసరమైన లారీలు, హమాలీలు ,కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

# స్నేహిత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ధైర్యం, భరోసా కల్పించాలి






**-కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు రక్షణ, భద్రత, బాలబాలికల హక్కులపై అవగాహన కల్పించేందుకు "స్నేహిత" కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాభారతిలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే ఒక దఫా అవగాహన కార్యక్రమాలు పూర్తయ్యాయని, విద్యార్థుల్లో ధైర్యం పెరిగి ఫిర్యాదులు చేయగల స్థాయికి వచ్చారని తెలిపారు. వ్యవసాయ, వైద్య, ఐసిడిఎస్, డిఆర్డిఓ, మెప్మా, పంచాయతీ శాఖల సమన్వయంతో ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందాలు ప్రతి మంగళవారం రెండు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మమేకమవుతాయని, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తాయని వివరించారు. ప్రతి పాఠశాలలో "స్నేహిత ఫిర్యాదుల పెట్టె" ఏర్పాటు చేసి, విద్యార్థులు ధైర్యంగా therein ఫిర్యాదులు చేయాలని సూచించారు. ఈ పెట్టెలను షీ టీం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నమ్మకం, భరోసా కల్పించాల్సిన సామాజిక బాధ్యత ఉందని, బాలికల రక్షణలో తల్లిదండ్రుల కన్నా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పిడి స్వరూపారాణి, షీ టీం ఇన్స్పెక్టర్ శ్రీలత, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం "స్నేహిత" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా కల్వకుర్తి నాయకుల ప్రచారం



**కల్వకుర్తి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయమని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి విజయకుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడా ప్రాంతంలోని 224, 229, 230 బూత్‌లలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పీసీసీ ప్రతినిధి ఇందిరా శోభన్, టీజీఐసీఎస్ఎస్ నిర్మల జగ్గారెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలిత, అభ్యర్థి నవీన్ యాదవ్, ఆయన సతీమణి వర్షా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో కాయితి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు మద్దతుగా ఓటు వేయాలని, కుల మత వర్గాలకు అతీతంగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. లౌకిక వాదానికి కట్టుబడి ఉండే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు కుట్రలు చేస్తున్నా, జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎం. దామోదర్, దాసరి యాదయ్య, బి. నర్సింలు, అజీజ్, పబ్బతి వెంకటయ్య, అశోక్, జూపల్లి బాలరాజ్, వద్దె రాజు, పులిజాల విష్ణు, పబ్బతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ గా మునాస ప్రసన్నకుమార్

**ఏకగ్రీవంగా ఎన్నుకున్న వివిధ బీసీ కుల సంఘాలు,ఐక్య ఉద్యమాలతో బీసీ రిజర్వేషన్ల సాధనకు కృషి చేస్తా: ప్రసన్నకుమార్**



**నల్లగొండ ,నవంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చీలికలు పేలికలుగా ఉన్న వివిధ కుల సంఘాల అందరినీ కలుపుకొని ఐక్య ఉద్యమాలు నిర్మిస్తూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాలసిన రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేస్తానని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునస ప్రసన్న కుమార్ అన్నారు.గురువారం స్థానిక నల్లగొండ పట్టణంలోని గంగపుత్ర భవనంలో జరిగిన బిసి జేఏసీ సన్నాహక సమావేశంలో వివిధ కుల సంఘాలకు సంబంధించిన నాయకులతో సుదీర్ఘంగా చర్చలు జరిపి సమిష్టిగా అందరు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేసి మునాస ప్రసన్న కుమార్ ని బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ గా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి బరువైన బాధ్యతలు పెట్టిన బీసీ బంధువులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీలలో ఉన్న 112 కులాలకు సంబంధించిన వారందరినీ కలుపుకొని సమిష్టిగా ఉద్యమాలు నిర్మిస్తానని ఐక్యంగా ముందుకు సాగుతామని వారన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అందరినీ కలుపుకొని బహుజన రాజ్యాధికారం దిశగా అవిశ్రాంతంగా పనిచేస్తానని వారన్నారు.ఈ కార్యక్రమంలో గండిచెర్వు వెంకన్న, పందుల సైదులు, ఐతగొని జనార్దన్ గౌడ్, పాల్వాయి రవి, చిలుకరాజు చెన్నయ్య,పుట్ట వెంకన్న, నజీరుద్దీన్, కర్నాటి యాదగిరి, గద్దం మారయ్య, తలారి యాదగిరి, నర్సింహా, మార్గం సతీష్ కుమార్, నరేందర్, రాజు, అంబటి శివ కుమార్, శ్రీనివాస్ యాదవ్,నాగరాజు గౌడ్,రాజు యాదవ్, సిద్ధార్థ, గడగొజు విజయ్, జీవన్ బాబు, భూతం సతీష్,శంకరయ్య, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి యుఎస్ఎఫ్ఐ చాయ్ నిరసన




**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల యజమాన్యాలు చేపట్టిన బంద్‌కు మద్దతుగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) కరీంనగర్ నగర కమిటీ ఆధ్వర్యంలో చాయ్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని టీ స్టాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల చదువులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు.నగర కార్యదర్శి అల్లేపు అభిలాష్ మాట్లాడుతూ, విద్యాసంస్థల యజమాన్యాలతో తక్షణమే చర్చలు జరిపి విద్యార్థుల చదువులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి అనేక అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నా, విద్యారంగంపై మాత్రం ఆసక్తి లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.7213 కోట్ల స్కాలర్షిప్, రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా విడుదల చేయకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. విద్యారంగంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా మంత్రి ఇంటిని ముట్టడించేందుకు సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. వెనుకబడిన విద్యార్థులు ఉన్నత చదువుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, స్థానిక మంత్రులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రావణ్, అరుణ్, మధు, రఘు, అరుణ్ కుమార్, అభిలాష్, మణి, తేజ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లాను ఆరోగ్య కార్యక్రమాల్లో అగ్రస్థానంలో నిలపాలి

**- డాక్టర్ రవి రాథోడ్**





**మహబూబాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో మహబూబాబాద్ జిల్లాను అగ్ర బాగాన నిలపాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాత శిశు సంరక్షణ, క్షయ వ్యాధి నియంత్రణ అంశాలపై వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణులకు యోగా శిక్షణ ఇవ్వడం, కుటుంబ పెద్దలకు సాధారణ ప్రసవం లాభాలపై అవగాహన కల్పించడం ద్వారా ఈ శాతం తగ్గించవచ్చని సూచించారు. బయ్యారం, కొత్తగూడ, గూడూర్, డోర్నకల్, తొర్రూర్, దంతాలపల్లి, నెల్లికుదురు ప్రాంతాల్లో సాధారణ ప్రసవాల ప్రోత్సాహక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణుల ప్రసవ తేదీల పట్టికలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్లు విజయకుమార్, శ్రవణ్ కుమార్, ప్రత్యూష, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, ఆరోగ్య బోధకులు, ఎన్‌హెచ్ఎం డిపిఓ నీలోహన, టిబి ప్రోగ్రాం మేనేజర్ నీలిమ శ్వేత, నర్సింగ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు




**నల్లగొండ, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహం ముందు కళ్లకు గంతలు కట్టుకుని విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మంపాటి శంకర్, రియాజ్, వరుణ్, నాని, శివ, చరణ్, రంజిత్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

# కొండపోచమ్మ సాగర్ జలాశయాన్ని పరిశీలించిన కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగదేవ్‌పూర్, భువనగిరి ప్రాంతాలకు కొండపోచమ్మ సాగర్ జలాశయం ద్వారా విడుదలవుతున్న నీటిని తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. డెలివరీ కెనాల్ గేట్లలో సాంకేతిక లోపం తలెత్తడంతో మూసివేత జరగకపోవడంతో బుధవారం రాత్రి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇరిగేషన్ అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమైన నేపథ్యంలో, రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి గురువారం మరోసారి డెలివరీ కెనాల్‌ను పరిశీలించి, తక్కువ సమయంలో సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించారు. భవిష్యత్తులో గేట్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం జలాశయం కట్ట వెంబడి ఉన్న ముంపు ప్రాంతాన్ని పరిశీలించి, పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ లక్ష్మణ్, సిఈ శివ ధర్మ తేజ, ఈఎన్సి హమ్జత్ ఉస్సెన్, ఈఈ శ్రీనివాస్, డిఈ, ఏఈలు, తహసిల్దార్లు తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కారం లేకుంటే సమ్మెకు సిద్ధం

-ఏఐటియుసి



**గోదావరిఖని, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ, గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్స్, ఓసిపి-5 ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ, సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పోరాడేది ఏఐటియుసి మాత్రమేనని, ఇతర సంఘాలు అసత్య ప్రచారాలు చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. మెడికల్ బోర్డు నిర్వహణ, సొంత ఇంటి పథకం, విజిలెన్స్ కేసుల పరిష్కారం, డిపెండెంట్‌లకు ఉద్యోగావకాశం, అలవెన్స్‌లపై ఇన్కమ్ టాక్స్ భారం, డిస్మిస్ ఉద్యోగులకు మరో అవకాశం, జూనియర్ అసిస్టెంట్ పరీక్ష, కొత్త గనుల ప్రారంభం, ప్రమోషన్‌ల అంశాలపై స్పష్టమైన డిమాండ్లు చేశారు. వీటిపై స్పందన లేకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, కె. శ్రీనివాసరావు, సయ్యద్ సోహేల్, సిర్ర మల్లికార్జున్, గుర్రం ప్రభుదాస్, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయ పరిహారం ఇవ్వాలి: నడికూడ శివ



**మహేశ్వరం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఐటీ పార్క్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 2 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని ఐఎన్‌టీయూసి మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షుడు నడికూడ శివ డిమాండ్ చేశారు. కందుకూరు ఆర్డీవో సమక్షంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతుల కష్టార్జిత భూములను ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్నప్పుడు వారిని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం అందే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతుల హక్కులను కాపాడటంలో ఐఎన్‌టీయూసి ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సమావేశంలో పలువురు రైతులు తమ సమస్యలను ఆర్డీవోకు వివరించారు.

# దివ్యాంగుల మద్దతుతో బీఆర్ఎస్ బైక్ ర్యాలీ




**జూబ్లీహిల్స్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎర్రగడ్డ, బోరబండ, శంకర్ లాల్ నగర్, వెంకటేశ్వర నగర్ కాలనీ, సుల్తాన్ నగర్ తదితర ప్రాంతాల్లో వికలాంగుల ఓటర్లను కలిసి ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగుల పింఛన్ రూ. 500 నుంచి రూ. 1500కి, అనంతరం రూ. 3016కి పెరిగిందని, 2023లో మళ్లీ రూ. 1000 పెంచి మొత్తం రూ. 4016గా ఆసరా పింఛన్ అందించారని తెలిపారు. కెసిఆర్ గారిని దివ్యాంగులు దైవంతో సమానంగా భావిస్తున్నారని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, డబుల్ బెడ్‌రూమ్ పథకంలో 5 శాతం రిజర్వేషన్ అమలుతో దివ్యాంగుల కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడించి వికలాంగుల ఓటు విలువను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ నయీమ్, వై.వి. రమణ, స్థానిక దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి తరపున తాళ్లపల్లి నారాయణకు అభినందనలు




**మంచిర్యాల, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మందమర్రిలోని ఆర్‌డీ-3 సివిల్ డిపార్ట్మెంట్లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాళ్లపల్లి నారాయణ గౌడ్ కంపెనీ లెవెల్ కల్చరల్ మీట్‌లో ప్రతిభ కనబరిచి సింగరేణి తరపున కోల్ ఇండియా కల్చరల్ మీట్‌కు ఎంపికయ్యారు. ఈనెల జరిగిన పోటీల్లో సింగిల్ ఫోక్ విభాగంలో మొదటి స్థానం, గ్రూప్ ఫోక్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. డిసెంబర్ 10 నుండి 12 వరకు నాగపూర్‌లో జరగనున్న కోల్ ఇండియా కల్చరల్ మీట్‌లో సింగరేణి ప్రతినిధిగా పాల్గొననున్న నారాయణను పలువురు అభినందించారు. కోల్ ఇండియా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి సంస్థకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

# వృద్ధురాలి అంతిమయాత్రకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత

**రామగుండం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం కార్పొరేషన్ 50వ డివిజన్ ద్వారకనగర్‌కు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు కస్తూరి అంకు మృతిచెందిన నేపథ్యంలో, కుటుంబ సభ్యులు లేకపోవడంతో స్థానికులు తలకొన్ని డబ్బులు వేసి ఆమె అంత్యక్రియలకు అండగా నిలిచారు. గురువారం జరిగిన అంతిమయాత్ర సందర్భంగా పాడే సామగ్రి కోసం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్‌కు ఫోన్ చేయగా, ఆయన వెంటనే స్పందించి అవసరమైన సామాన్లను పంపించారు. వృద్ధురాలి ఆఖరి మజిలి యాత్రకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అందించిన సహాయాన్ని ద్వారకనగర్ ప్రజలు హృదయపూర్వకంగా అభినందించారు. మల్లేష్ అన్నకు, ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జల్పల్లిలో వ్యక్తి అదృశ్యం

- పోలీసుల గాలింపు



**బాలాపూర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జల్పల్లి గ్రామానికి చెందిన గుజ్జరోలు అశోక్ (36) అనే వ్యక్తి అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. నవంబర్ 5వ తేదీ ఉదయం దుర్గానగర్‌లో టీ తాగడానికి వెళ్లిన అశోక్, తిరిగి వచ్చేసరికి తన ఆటోలో ఉంచిన మొబైల్ కనిపించకపోవడంతో ఇంటికి వచ్చి మద్యం సేవించి నిద్రపోయాడు. సాయంత్రం 6 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. అశోక్ భార్య గుజ్జరోలు అర్చన పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. అదృశ్యమైన వ్యక్తి తెల్లగా, 5.4 అడుగుల ఎత్తు, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడు. బయటకు వెళ్లినప్పుడు తెలుపు రంగు షర్ట్, నీలం రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# శంకర్పల్లిలో జాతీయ వాలీబాల్ టోర్నీ



**శంకర్పల్లి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామ రెవెన్యూ గల్ల ఓ ఫామ్ హౌస్‌లో సి.ఎస్. విటల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నవంబర్ 8, 9 తేదీల్లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పత్రికా సమావేశంలో ఎలవర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌కు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జె.డి. లక్ష్మీనారాయణ, రిటైర్డ్ నేవీ అధికారి సంజీవ్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ప్రారంభోత్సవాన్ని కృష్ణప్రియ కందరవల్లి నిర్వహించనున్నారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతి రూ. 1 లక్ష, రెండో బహుమతి రూ. 50 వేలు కాగా, మహిళల విభాగంలో మొదటి బహుమతి రూ. 25 వేలు, రెండో బహుమతి రూ. 10 వేలు గా ప్రకటించారు. ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్రభుత్వం, సౌత్ సెంట్రల్ రైల్వే, జీఎస్టీ వైజాగ్, చెన్నై, ముంబై, ఆర్మీ ఏఎస్‌సి, రెడ్ ఆర్మీ, గ్రీన్ ఆర్మీ, తమిళనాడు టైగర్స్ జట్లు పాల్గొననున్నాయి. మహిళల విభాగంలో సౌత్ సెంట్రల్ రైల్వే, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, సేవా, ఎస్ఆర్ఎం జట్లు పోటీ పడనున్నాయి.

# ఆర్ఎంపీ, పీఎంపీ అధ్యక్షుడికి బీజేపీ సత్కారం



**గంభీరావుపేట, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంభీరావుపేట మండల ఆర్ఎంపీ పీఎంపీ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్వీట్లు పంచుతూ హర్షాతిరేకంగా అభినందనలు తెలిపారు. ఈ సత్కార కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు పత్తి స్వామి, నాగరాజుగౌడ్, సర్వోత్తమ్, నర్సింలు, ఎల్లం రాజేష్, స్వామి, రమేష్, దేవేందర్ నాయక్, రాజు, నవీన్, సతీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లోకి రఘుపతి, బాలస్వామి



**అమ్రాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెంకటేశ్వర్ల బావి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏనుపోతుల రఘుపతి, బాలస్వామి పార్టీ వైఖరి నచ్చక కాంగ్రెస్ అభివృద్ధిని చూసి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారు ఆహ్వానించి, భవిష్యత్తులో సమీక్షిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చారి, అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఠాకూర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం: కాంగ్రెస్



**రామగుండం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బసంత్‌నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు ముక్తకంఠంతో హెచ్చరించారుఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. 20 నెలల ప్రజాపాలనలో వందల కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, టీఆర్ఎస్ పాలనలో పదేళ్లలో కనిపించని పురోగతి ఇప్పుడు ప్రజలకు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి టీఆర్ఎస్ భవిష్యత్తుపై వణుకుతోందని వ్యాఖ్యానించారు. ఠాకూర్ పాలనపై విమర్శలు చేసే దమ్ము ధైర్యం ఉంటే రెండు మండలాల హెడ్‌క్వార్టర్లలో చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాయలింగు, మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, గంగాధర రమేష్, ఎర్రం స్వామి, పరిషవేణి శ్రీనివాస్, పొన్నం సత్తయ్య, పాత రవీందర్, తుంగ నరసయ్య, గోలి రాజు, కాసర్ల కిరణ్, కాదాశి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు: ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత కొద్ది రోజులుగా మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల అచ్చంపేట నియోజకవర్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా అచ్చంపేట మండలం సిద్దాపూర్ నుంచి అక్కరం వెళ్ళే మార్గంలో కల్వర్టు తెగిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, పిసిసి ఉపాధ్యక్షులతో కలిసి సంబంధిత అధికారులతో చర్చించి, కల్వర్టు వద్ద తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్పందించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన తప్పదు: టీయూడబ్ల్యూజే



**రంగారెడ్డి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శంకర్‌పల్లి మండలంలోని పొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్ అలీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, జాప్యంపై తీవ్రంగా చర్చించారు.ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తయినా జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తమైంది. గతంలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు చేసినట్లు గుర్తుచేస్తూ, ఇప్పుడు కూడా అదే తీరును కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐజేయు జాతీయ అధ్యక్షుడు, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఐజేయు జాతీయ ప్లీనరీ విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. జనవరిలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు సమావేశం నిర్ణయించింది. ఇటీవల అకాల మరణం చెందిన 16 మంది జర్నలిస్టులకు నివాళి అర్పిస్తూ మౌనం పాటించారు. సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పంట నష్టానికి తక్షణ పరిహారం ఇవ్వాలి: రైతు జగన్







**మహేశ్వరం, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం మండలంలోని కోళ్లపడకల్ గ్రామంలో అకాల వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతు చేపంగి జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దకుంట చెరువు పరిసరాల్లోని వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలతో పాటు ఇతర పంటలు నీటమునిగి పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. రైతుల కష్టార్జిత పంటలు నాశనమవుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. నష్టాన్ని వెంటనే గుర్తించి, తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు బీదరికంలో మునిగిపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తక్షణ సాయం అందించాలని కోరారు. రైతు మన దేశానికి అడ్డుగోడ అని గుర్తుచేస్తూ, మండల అధికారులు, గ్రామ పెద్దలు కలిసి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని జగన్ విజ్ఞప్తి చేశారు.

## జూబ్లీహిల్స్ గెలుపే లక్ష్యం: దేప భాస్కర్



**రంగారెడ్డి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు దేప భాస్కర్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి కీలకమైందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకత్వం నవీన్ యాదవ్‌దేనని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చి.యాదయ్య, గోపాల్ రెడ్డి, స్వామి నాయక్, బాలకృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అవినీతి

### అధికారులపై చర్యలకై లీగల్ నోటీసు



**కరీంనగర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.4.50 కోట్లకు పైగా జరిగిన అవినీతి కుంభకోణంపై చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, సంబంధిత అధికారులపై లీగల్ నోటీసులు జారీ చేసినట్లు అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తెలిపారు. గతంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో జరిగిన విచారణలో డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ నవీన, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ మొహమ్మద్ అలీమ్, డాక్టర్ రత్నమాల, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జ్యోతి తదితరులు హెచ్‌డీఎస్ నిధులు, కాయకల్ప్, టీవీవీపీ, టీఎస్ఎంఎస్ఐడీసీ, డీజిల్ పెట్రోల్ ఖర్చుల పేరుతో భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డట్లు తేలిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఆరోగ్య శాఖ కార్యదర్శి, విజిలెన్స్ కమిషన్, జిల్లా కలెక్టర్, సీపీ, ఏసీబీ డైరెక్టర్ జనరల్‌లకు లీగల్ నోటీసులు పంపినట్లు తెలిపారు. బిల్లులు లేకుండా గొలుసు చర్యలతో నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(c)(d), బీఎన్ఎస్ సెక్షన్లు 316, 317, 318 కింద ప్రాసిక్యూషన్ చేపట్టాలని, వారి ఆస్తుల అసమానతపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా లీగల్ నోటీసుకు సమాధానం రాకపోతే న్యాయపరంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కన్వీనర్ రావుల ఆదిత్య, జిల్లా నాయకులు కె. బద్రినేత, ప్రశాంత్, సుధామ్ తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్య నగర్ దేవాలయంలో ఘనంగా రుద్ర

### -చండీ హెూమాలు



**కుత్బుల్లాపూర్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్య నగర్‌లో శ్రీ కామాక్షి సమేత ఏకాంమ్రనాథ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మాణిక్య నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్ర హెూమం, చండీ హెూమం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ కె.యం. ప్రతాప్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం ఎంతో చక్కగా జరిగిందని ప్రశంసించిన ప్రతాప్ గారు, నవగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో భాగంగా యజ్ఞ -యాగాలు, మహా కుంభాభిషేకాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను విస్తరించడంలో అసోసియేషన్ పాత్రను కొనియాడారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు రాజేష్, ఖలీల్, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, నాగరాజ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, మధు, జయేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సురేష్, రఘునాథరెడ్డి, గోపాల్ రెడ్డి, సలహాదారులు ఇంద్రసేనారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, భీమప్ప, కాలనీ సీనియర్ సిటిజన్లు పోచయ్య, కేవీఆర్ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరంగం శ్రీనివాస చార్యులు, మాణిక్య నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో మైసమ్మ విగ్రహాల కూల్చివేత

### - భక్తుల ఆగ్రహం, అధికారుల మౌనం



**గోదావరిఖని, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న దారి మైసమ్మ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో కూల్చివేయడం స్థానిక భక్తుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఉదయం లేచి చూసిన ప్రజలు విగ్రహాలు లేకపోవడంతో షాక్‌కు గురయ్యారు. ఈ ఘటన గోదావరిఖని ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ సిబ్బందేనా? లేక రోడ్డు పనుల కాంట్రాక్టర్ల చర్యలేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ధార్మిక భావాలను దెబ్బతీసే ఈ చర్యను స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.రాత్రికి రాత్రే విగ్రహాలను తొలగించిన తీరు దొంగల చర్యలా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై బీజేపీ, బజరంగ్ దళ్, ఇతర హిందూ వాద సంస్థలు ఎలా స్పందిస్తాయో అనే ఆసక్తి నెలకొంది.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట

### -ఎస్ఈ వెంకట నరసింహారెడ్డి



**వెల్దండ, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ప్రజా బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ) కె. వెంకట నరసింహారెడ్డి తెలిపారు. గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ మండల కేంద్రంలోని సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులతో మాట్లాడిన ఎస్ఈ, గ్రామస్థాయిలో విద్యుత్ సమస్యలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రజా బాట కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ముఖ్యంగా లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి అదనపు నియంత్రికలు, మధ్యలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వేలాడుతున్న తీగల సరిచూడడం వంటి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ సమస్యలు ఎక్కడున్నా స్థానిక సిబ్బందికి తెలియజేయాలని, తక్షణమే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఏఓ పార్థసారథి, లైన్మెన్లు లక్ష్మణ్ నాయక్, లస్కర్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు భరత్ గౌడ్, కాలనీవాసులు సుధా లక్ష్మయ్య, శ్రీశైలం, మట్ట మదన్, సిమ్ముల రవి, భయ్యా ముత్యాలు, లక్ష్మయ్య, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ విజయం ఖాయం

### - మోతిలాల్ నాయక్



**వెల్దండ, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని, మెజారిటీ కోసమే ప్రచారం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూడవత్ మోతిలాల్ నాయక్ తెలిపారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవీన్ యాదవ్ 50 వేల ఓట్ల పైచిలుకు మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేసిన మోతిలాల్ నాయక్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంక్షేమ ఫలాలు అందుతున్న తరుణంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తారని పేర్కొన్నారు.

# హుస్నాబాద్ గిరిజన తండాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో బీటీ రోడ్లు



**హుస్నాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అనుసంధానం కాని గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. “బీటీ రోడ్స్ టు ఎస్టీ హాబిటేషన్స్” గ్రాంట్ కింద జి.ఓ.ఆర్.టి. నెం.276 ద్వారా రూ.2480.00 లక్షల వ్యయంతో 13 రోడ్లకు గిరిజన సంక్షేమ శాఖ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్లకు అనుమతులు రావడంతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో ఆనందం వెల్లివిరిసింది. అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గిరిజన వాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో పీడబ్ల్యూడీ రోడ్ నుంచి రాంనగర్ తండా వరకు, ములకనూరు నుంచి నరహరి తండా వరకు బీటీ రోడ్లకు అనుమతులు లభించాయి. కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలంలో రాయికల్ నుంచి రాయికల్ తండా వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలంలో కేశనాయక తండా నుంచి పెద్దమ్మ టెంపుల్ పీడబ్ల్యూడీ రోడ్ గట్ల మల్యాల వయా వడ్డెర కాలనీ వరకు, మల్లారం ఎక్స్ రోడ్ నుంచి దుబ్బతండా వరకు, రాజతండ నుంచి పంచారాయి తండా వరకు, దుధ్యతండ నుంచి తిరుమల్ తండా వరకు, తుక్కితండ నుంచి దేవుల్ నాయక్ తండా వరకు, ఇప్పుల్ తండా నుంచి దుబ్బతండా వరకు, శ్రీరామ్ కాలనీ నుంచి తెల్లపలుగు తండా వరకు, నణ్యతండ నుంచి శ్రీరామ్ తండా వరకు, పన్యనాయక్ తండా నుంచి పంతులు తండా వరకు, బోరింగ్ తండా నుంచి శ్రీరామ్ తండా వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ రోడ్ల నిర్మాణంతో తండాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అభివృద్ధి పథంలో హుస్నాబాద్ ముందుకు సాగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాక్, చైనాను వణికించిన భూకంపం

## అఫ్ఘాన్‌లోనూ ప్రకంపనలు



**న్యూఢిల్లీ నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దాయాది పాకిస్థాన్, చైనా దేశాలను భూకంపం వణికించింది. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పాక్‌లో భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.3గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 240 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించారు. అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. పాక్‌లో ఇటీవలే వరుస భూ ప్రకంపనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే.మరోవైపు చైనాలోనూ భూకంపం సంభవించింది. వాయువ్య చైనాలోని జిన్జియాంగ్‌లో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.7గా నమోదైనట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. 220 కి.మీ లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది. తాలిబన్ల ఆధీనంలోని అఫ్ఘానిస్థాన్ లో మరోసారి భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.4గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కాగా, అఫ్ఘాన్‌లో భూకంపం సంభవించడం మూడు రోజుల్లో ఇది రెండోసారి. నవంబర్ 3వ తేదీన 6.3 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 20 మందికిపైగా మృతి చెందగా, 300 మందికిపైగా గాయాలపాలయ్యారు. దాన్నుంచి కోలుకోకముందే మరోసారి ప్రకంపనలు రావడంతో అఫ్ఘాన్ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# అతను పాకిస్థాన్ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంత



**న్యూఢిల్లీ నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్.. పాకిస్థాన్ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంత అని, మానసికంగా స్థిరత్వం లేని వ్యక్తి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023 ఆగస్టు నుంచి అదియాలా జైలులో ఖైదీగా ఉన్న ఇమ్రాన్ ఎక్స్ వేదికగా ఈ ఆరోపణలు చేశారు.మునీర్ పాలనలో అణచివేత గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని, అధికార దాహంతో కళ్లుమూసుకుపోయిన ఆయన దాని కోసం ఎంతకైనా తెగిస్తారని ఇమ్రాన్ ఖాన్ దుయ్యబట్టారు. నవంబర్ 26 మే 9న మురిడ్కే ఘటనలను ప్రస్తావిస్తూ.. ఇవి అధికార దుర్వినియోగానికి స్పష్టమైన ఉదాహరణలని విమర్శించారు. పోలీసులు, భద్రతాసిబ్బంది తమ పార్టీ కార్యకర్తలను హత్య చేశారని ఆరోపించారు.నిరాయుధులైన పౌరులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం ఏ నాగరిక సమాజంలోనూ ఊహించలేమని ఖాన్ అన్నారు. మహిళలపై ఇంతటి క్రూరత్వం గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. తన భార్య బుష్రా బీబీని ఏకాంత నిర్బంధంలో ఉంచి అసీమ్ మునీర్ వేధిస్తున్నారని ఆరోపించారు. బానిసత్వంలో బతకడం కంటే మరణమే మేలని వ్యాఖ్యానించారు. అసిమ్ మునీర్ తనపై, తన భార్యపై అన్ని రకాల అన్యాయాలకు పాల్పడుతున్నారని అన్నారు.ఏ రాజకీయ నాయకుడి కుటుంబం కూడా ఇంతటి క్రూరత్వాన్ని ఎదుర్కోలేదని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఎన్ని చేసినా సరే తాను తలవంచను, లొంగిపోను అని మరోసారి స్పష్టం చేయాలనుకుంటున్నా అని తేల్చి చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంతో సయోధ్యకు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని కీలుబొమ్మ ప్రభుత్వంతోగానీ, సైనిక నాయకత్వంతోగానీ తమ పార్టీ చర్చలు జరపదని అన్నారు.

# కేంద్రం తీరు సరికాదు

## పదేపదే వాయిదాలు కోరడంపై జస్టిస్ గవాయ్ ఆగ్రహం



**న్యూఢిల్లీ -నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం-2021పై కేంద్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ విభేదించారు. ఈ చట్ట నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలంటూ కేంద్రం పదే పదే కోరుతుండడంపై జస్టిస్ గవారు అసహనం వ్యక్తం చేశారు. బెంచ్ ఏర్పాటును తప్పించడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ”ఇప్పటికే రెండుసార్లు మీరు కోరినట్లుగా వాయిదా వేశాం. ఇంకా ఎన్నిసార్లు జరగాలి? నవంబరు 24 తర్వాత దీన్ని కావాలనుకుంటే అప్పుడు మాకు చెప్పండి.” అని సిజెఐ అన్నారు. 24వ తేదీనే జస్టిస్ గవాయ్ పదవీ విరమణ చేయనున్నారు. ”అత్యున్నత రాజ్యాంగ కోర్టు పట్ల మాకు గౌరవం వుంది. రేపు మేం ఎలాంటి కేసులు చేపట్టడం లేదు. రేపు విచారణ జరిపి, వారాంతంలో తీర్పు ఇవ్వాలనుకుంటున్నాం.” అని ఆయన చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని జస్టిస్ గవాయ్ విమర్శించడం ఇది రెండవసారి. ఇప్పటికే విచారణ జరుగుతుండగా, రాజ్యాంగ ధర్మాసనానికి ఈ అంశాన్ని నివేదించాలంటూ ప్రభుత్వం కోరడంపై ఈ నెల 3న సిజెఐ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ”అసలు ఇలాంటి వైఖరితో కేంద్రం ఎలా ముందుకు వస్తోందో తెలుసుకుంటే చాలా దిగ్భ్రాంతికి గురవుతు న్నాం. కేంద్రం నుండి ఇలాంటి ఎత్తుగడలను మేం ఊహించలేదు.” అని జస్టిస్ గవారు వ్యాఖ్యానించారు. గత విచారణ సందర్భంగా ఈ అభ్యంత రాలు లేవనెత్తకపోగా వ్యక్తిగత కారణాలతో వాయిదా కోరారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత ఇలాంటి అభ్యంతరాలు లేవనెత్తరాదని అన్నారు. విస్తృత బెంచ్‌కు ఈ అంశాన్ని నివేదించాలన్న పిటిషన్‌ను జస్టిస్ గవారు నేతృత్వంలోని బెంచ్ తోసిపుచ్చింది. విస్తృత బెంచ్‌కు రిఫర్ చేయాల్సిన అంశమని తేలితే అప్పుడు చేస్తామని, తదుపరి విచారణను 7వ తేదీకి వాయిదా వేశారు.

# ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగితే ఎన్‌డిఎ కుప్పకూలుతుంది



**పాట్నా నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీహార్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఎ ప్రభుత్వం కుప్పకూలుతుందని కాంగ్రెస్‌నేత ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. గురువారం ఆమె బీహార్‌లో ఎన్నికల ర్యాలీ చేపట్టారు. దేశ అభివృద్ధికి అపారమైన కృషి చేసిన బీహార్ ప్రజల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి గౌరవం లేదని అన్నారు. అభివృద్ధి పేరుతో కాకుండా మతం పేరుతో ఎన్‌డిఎకు ఓట్లు వేయాలని బిజెపి నేతలు ప్రజలను డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఎ ప్రభుత్వం కూలిపోతుందని అన్నారు. పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేస్తారని అన్నారు. బీహార్‌లో గత మూడేళ్లలో 27 బ్రిడ్జీలు కూలిపోయాయని, ఎన్‌డిఎ ప్రభుత్వంలో మౌలికసదుపాయాల అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తుపానుతో ఫిలిప్పీన్స్ అతలాకుతలం..

## -140 మంది మృతి



**మనీలా నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్మెగి తుపాన్ ధాటికి ఫిలిప్పీన్స్ అతలాకుతలమైంది. తుపాను తర్వాత సంభవించిన ఆకస్మిక వరదల కారణాంగా 140 మంది చనిపోయారు. 217 మంది గల్లంతు కాగా, 82 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ గురువారం అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.మీడియా కథనాల ప్రకారం తుపాను కారణంగా సుమారు 20 లక్షల మంది ప్రభావితమయ్యారు. 5.6 లక్షల మంది గ్రామస్థులు నిరాశ్రయులయ్యారు.

# ముంబైలో లోకల్ ట్రైన్ ఢీకొని ముగ్గురి మృతి



**ముంబై,నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్ వద్ద రైల్వే ఉద్యోగుల నిరసన కారణంగా సెంట్రల్ రైల్వే లైన్‌లో లోకల్ ట్రైన్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా శాండ్‌హర్స్ట్ రోడ్‌స్టేషన్ సమీపంలో పట్టాలపై నడుస్తున్న నలుగురు ప్రయాణికులను అంబర్‌నాథ్ ఫాస్ట్ లోకల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు అకడికకడే మరణించారు. మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి.

# హత్యాయత్నం ఘటనపై కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ



**కల్వకుర్తి, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని సంజాపూర్ గ్రామంలో జరిగిన హత్యాయత్నం ఘటన కలకలం రేపుతోంది. బాధితుల పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, పోలీసులు వేగంగా స్పందించి ఆరుగురు నిందితులలో ఐదుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ స్పందిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, నిన్న సాయంత్రం సంజాపూర్‌లో జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదే సమయంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివాహేతర సంబంధమే ఈ హత్యాయత్నానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని వారు పేర్కొన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.